క్లుప్తంగా

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రామవరప్పాడు: రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో అంగన్‌వాడీ సహాయకురాలు, కార్యకర్తల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి జి. మంగమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామవరప్పాడు (ఓసీ), ప్రసాదంపాడు (ఓసీ), నున్న (బీసీ-బీ), కొత్తూరు తాడేపల్లిలో (ఓసీ) అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా సూచించారు. 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, స్థానిక వివాహిత మహిళ అయి ఉండాలని, 1.7.2023 నాటికి 21 ఏళ్లు నిండి 35 సంవత్సరాలలోపు ఉండాలని, కుల, నివాస ధ్రువపత్రం, ఆధార్ కార్డు, రేషన్ కార్డు కాపీలను దరఖాస్తుకు జతపరచాలని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తును ఈ నెల 13వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో స్వయంగా అందజేయాలని పేర్కొన్నారు.

15 నుంచి సెల్‌ఫోన్ రిపేర్‌పై ఉచిత శిక్షణ

ఉంగుటూరు: మండలంలోని ఆత్కూరు స్వర్ణ భారత్ ట్రస్ట్‌లో ఈ నెల15వ తేదీ నుంచి సెల్ ఫోన్ రిపేరు కోర్సు ఉచిత శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు ట్రస్ట్ డైరెక్టర్ పరదేశి తెలిపారు. స్థానిక విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడుతూ ట్రస్ట్‌లో ఆధునిక పరికరాల సాయంతో కొత్తగా నెలకొల్పిన ల్యాబ్‌లో సెల్ ఫోన్ రిపేరులో శిక్షణ ఇస్తారని చెప్పారు. అన్ని రకాల మొబైల్స్ రిపేరులో మెళకువలతో శిక్షణ అందజేస్తారని పేర్కొన్నారు. 10వ తరగతి చదివి 18 ఏళ్లు దాటిన వారు అర్హులని వివరించారు. ఆసక్తి ఉన్నవారు 93478 97922 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పేదరిక నిర్మూలనకు 'ఉపాధి'

ఉంగుటూరు: పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ఉపాధి హామీ పథకంలో ప్రతి కుటుంబానికి 100 రోజుల పనిని ప్రభుత్వం కల్పిస్తుందని ఎంపీడీఓ శేషగిరిరావు పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఉపాధి ప్రణాళిక పనుల గుర్తింపు గ్రామ సభలు సోమవారం నిర్వహించారు. ఎలుకపాడు, నాగవరప్పాడు, వెల్దిపాడు, వెన్నూతల గ్రామాల్లో గ్రామ సభల్లో 317 పనులు గుర్తించారని ఎంపీడీఓ తెలిపారు. సభల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, పాలకేంద్రం అధ్యక్షులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మేట్లు, సచివాలయ గృహ సారథులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



ఉంగుటూరు: నేషనల్ గేమ్స్ ఫెడరేషన్(ఎన్‌జీఎఫ్) అథ్లెటిక్స్, ఖోఖో రాష్ట్రస్థాయి పోటీలకు పెద అవుటపల్లి శ్రీసాయి శ్రీనివాస హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కె.జి.ఎస్.సాయిబాబా తెలిపారు. పాఠశాలలో సోమవారం రాష్ట్ర స్థాయి పోటీలకు ఎపికైన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో నేషనల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన అథ్లెటిక్స్, ఖోఖో పోటీల్లో ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని పేర్కొన్నారు. అండర్-14 కోకో కె.సృజన్, అండర్17 రన్నింగ్‌లో బి.బాబు, దీపిక, లిఖిత విజేతలుగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. క్రీడాకారులకు శిక్షణనిచ్చిన పీఈటీ గాంధీని, విజేతలను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

తేనె మంచుపురుగు ఉధృతిని గమనించాలి

గన్నవరం రూరల్: మామిడి తోటల రైతులు తేనె మంచు పురుగు ఉధృతిని గమనించాలని హార్టికల్చర్ అధికారి హరిచంద్ సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ దిగుబడి నాణ్యంగా, అధికంగా రావడానికి జాగ్రత్తలు పాటించాలన్నారు. తేనె మంచు పురుగు నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 ఎంఎల్ ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. మసి తెగులు నివారణకు కార్బెండాజిమ్ రెండు గ్రాములు ఒక లీటరు నీటిని కలిపి పిచికారి చేయాలని చెప్పారు. ముందు జాగ్రత్తలతో సస్యరక్షణ పాటించి మామిడి రైతులు మంచి దిగుబడులు పొందాలని ఆకాంక్షించారు.

వైఎస్సార్ సీపీకే ప్రజాదరణ

ప్రజాసంకల్పయాత్ర ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా సంబరాలు



ఉయ్యూరులో వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు

ఉయ్యూరు: వైఎస్సార్ సీపీకే ప్రజాదరణ ఉందని పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు స్పష్టం చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాడు ప్రజాసంకల్ప పాదయాత్ర చేపట్టి ఆరేళ్లు పూర్తైన సందర్భంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యాన సోమవారం బస్టాండ్ సెంటర్‌లో మహానేత వైఎస్సార్ విగ్రహం వద్ద వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప పాదయాత్రతో రాష్ట్ర భవిష్యత్తు మారిందని గుర్తు చేశారు. హామీలను అమలు చేసి దేశంలోనే ప్రజాదరణ పొందిన గొప్ప నేతగా ఖ్యాతి గడించారని కొనియాడారు. ప్రజా సంకల్ప బలం వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే ఉందన్నారు. జగనన్ననే మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన ఆవశ్యకత, బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబు కలాం, జిల్లా ఉపాధ్యక్షురాలు, కౌన్సిలర్ తెనాలి పద్మావతి, కౌన్సిలర్లు ఎం. లక్ష్మీ, కూరాడ వెంకటలక్ష్మి, ఎండీ బేగ్, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఖలీల్, నాయకులు సలీం బేగ్, అహ్మద్ ఖాన్, అబ్దుల్ సద్దాం, వణుకూరు సురేష్, ఆరేపల్లి నాగరాజు, గఫూర్, తదితరులు పాల్గొన్నారు.

కానూరులో విద్యార్థి సంఘ నేతల ర్యాలీ



కానూరులో జరిగిన ర్యాలీలో దేవినేని అవినాష్, జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ శ్రీదేవి

పెనమలూరు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప పాదయాత్ర చేపట్టి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా వైఎస్సార్ సీపీ విద్యార్థి సంఘం ఆధ్వర్యాన సోమవారం కానూరులో ర్యాలీ నిర్వహించారు. వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ వద్ద జరిగిన కార్యక్రమంలో పార్టీ విజయవాడ 'తూర్పు' ఇన్‌చార్జి దేవినేని అవినాష్ మాట్లాడుతూ ప్రజాసంకల్ప యాత్రతో రాష్ట్రంలో దాదాపు 3 వేల కిలోమీటర్లకు పైగా జగనన్న పాదయాత్ర చేశారన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకొని అధికారం చేపట్టిన వెంటనే సంక్షేమ పథకాలు అమలు చేశారని కొనియాడారు. విద్యార్థులకు ఫీజ్ రీయింబర్స్‌మెంట్ అమలు చేసి ఉన్నత విద్య చదివిస్తున్నారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా విద్యార్థులు నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ గరికపాటి శ్రీదేవి, విద్యార్థి సంఘ నేతలు ఎం.నాని, రాకేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల విరాళం



హెచ్‌ఎం దుర్గాభవానికి చెక్కు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

పెనమలూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని నూతన తరగతి గదుల్లో ఫ్లోరింగ్‌కు పూర్వ విద్యార్థులు సోమవారం తమ వంతు సాయం అందించారు. పాఠశాలలో 1968-1969 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు కిలారు వీరబ్రహ్మాజీ, కిలారు కిషోర్‌బాబు, కోలా నాగమల్లికార్జునరావు, తోటకూర శివరామకృష్ణప్రసాద్, పరిటాల శివశంకరప్రసాద్ రూ. 1.26 లక్షల చెక్కును పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై.దుర్గాభవానికి అందజేశారు. తరగతి గదుల్లో గ్రానైట్ వేయడానికి సాయం అందించారు. హెచ్‌ఎం దుర్గాభవాని మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సాయం మరువలేనిదని తెలిపారు.

200 మందికి అన్నదానం

పెనమలూరు: యనమలకుదురుకు చెందిన మెండెం హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యాన అన్నదానం చేశామని సంస్థ నిర్వాహకురాలు వీరంకి కీర్తి తెలిపారు. ఆమె సోమవారం వివరాలు తెలుపుతూ తమ సంస్థ ఆదివారం రాత్రి యనమలకుదురు, విజయవాడ పరిసర ప్రాంతాల్లో రోడ్డు పక్కన నివసించే దాదాపు 200 మంది పేదలకు భోజనం పెట్టామని తెలిపారు.

అన్ని వర్గాల సంక్షేమానికి కృషి



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వంశీ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న జర్నలిస్టులు, గౌసాని

గన్నవరం: రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ గౌసాని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని కేబినేట్‌లో నిర్ణయం తీసుకోవడం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ చిత్రపటానికి జర్నలిస్టులు క్షీరాభిషేకం చేశారు. గౌసాని మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం జర్నలిస్టుల గురించి పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి జర్నలిస్ట్‌కు మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలం ఇవ్వడానికి మంత్రి మండలి సమావేశంలో తీర్మానించడం ప్రశంసనీయమన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి.. నియోజకవర్గానికి చెందిన పలువురు జర్నలిస్టులు కృతజ్ఞతలు తెలిపారు.

రూ.72 లక్షలతో పైప్‌లైన్ నిర్మాణ పనులు



పెనమలూరులో పైప్‌లైన్ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న సర్పంచి లింగాల భాస్కరరావు

పెనమలూరు: గ్రామంలో మంచి నీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు సర్పంచి లింగాల భాస్కరరావు సోమవారం శంకుస్థాపన చేశారు. సర్పంచి భాస్కరరావు వివరాలు తెలుపుతూ ప్రకృతి హోమం వద్ద రూ. 34 లక్షలతో 60 వేల లీటర్ల వాటర్‌ట్యాంకు నిర్మాణం జరుగుతోందన్నారు. దీని కోసం పైప్‌లైన్ నిర్మాణానికి రూ.38 లక్షలు మంజూరు చేశామని తెలిపారు. అంబేడ్కర్ కాలనీలో రూ.10 లక్షలతో, ఎస్టీ కాలనీలో రూ.24 లక్షలతో కూడా పైప్‌లైన్ నిర్మాణం జలజీవన్ మిషన్ నిధులతో నిర్మాణం చేపట్టామని తెలిపారు. నెల రోజుల్లో వాటర్స్ వర్క్స్ పూర్తి చేస్తామన్నారు.

చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళదాం

ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి

విజయవాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లి అవగాహన కల్పించడానికి ఎంపీటీసీ సభ్యులు సహకరించాలని ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మరో నాలుగు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, చేసిన అభివృద్ధి పనులు ప్రజలకు తెలియచేసి వచ్చే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుందామన్నారు. వచ్చే ఏడాది రానున్న 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనుల ప్రతిపాదనలు పంపవచ్చని సభ్యులకు సూచించారు. అనంతరం తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన కె.లక్ష్మిని సభ్యులు ఘనంగా సత్కరించారు. గ్రామీణ నీటి సరఫరా విభాగంలో సుమారు రూ.2 కోట్లతో చేపట్టే జల జీవన్ మిషన్ గ్రాంటు పనులను డ్వాక్రాగ్రూపుల ద్వారా చేయడానికి రాష్ట్ర ముఖ్య కార్యదర్శి ఆదేశాలున్నాయని అసిస్టెంట్ ఇంజినీరు శ్వేత తెలియజేశారు. మండలంలో నాడు-నేడు కార్యక్రమంలో రూ.5.50 కోట్లతో మండల పరిషత్ పాఠశాలలను రెండో ఫేజ్‌లో అభివృద్ధి చేయనున్నట్లు ఎంఈఓ ఎ.వెంకటరత్నం తెలిపారు. గ్రామాల్లో లోఓల్టేజీ, ఓవర్‌లోడ్ సమస్యలను పరిష్కరించడానికి డిపార్టుమెంటు ద్వారా పనులు చేయడానికి నిధులున్నాయని ఏఈ పరమేశ్వరావు తెలిపారు. జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు ఉచితంగా మీటర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు కేంద్రాలు 19 ఏర్పాటు చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి బి.రంగనాథ్ తెలిపారు. ధాన్యం విక్రయాలకు పాటించాల్సిన నిబంధనలు వివరించారు. రైతులు ధాన్యంలో తేమశాతం నిర్ధారించడానికి కళ్లాల నుంచి శాంపిల్స్ టెక్నికల్ అసిస్టెంట్ ద్వారా తీసుకురావాలన్నారు. ధాన్యం మిల్లులకు తీసుకెళ్లే వాహనాలకు తప్పనిసరిగా జీపీఎస్ పరికరం అమర్చాలన్నారు. ఇరిగేషన్, ఐసీడీఎస్, గ్రామీణాభివృద్ధి పలు శాఖలపై సమీక్షించారు. సమావేశంలో ఉప ఎంపీపీ వి. సురేష్, జెడ్పీటీసీ సభ్యుడు కె.సువర్ణరాజు, కోఆప్షన్ అల్తాఫ్, ఇన్‌చార్జి ఎంపీడీఓ బీఎల్వీ శేషగిరిరావు, తహసీల్దార్ కె.లక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, వైద్య ఆరోగ్యశాఖ సూపర్‌వైజర్, ఇరిగేషన్ ఏఈ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశే ప్రభుత్వ లక్ష్యం



పాతపాడులో జరిగిన 'సురక్ష' శిబిరంలో మందులు అందజేస్తున్న జెడ్పీటీసీ కె.సువర్ణరాజు

పాతపాడు(విజయవాడరూరల్): రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్ చేయడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీటీసీ సభ్యుడు కె.సువర్ణరాజు చెప్పారు. పాతపాడు గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం జరిగింది. ఈ సందర్భంగా సువర్ణరాజు మాట్లాడుతూ ఇంటింటికీ వైద్య సేవలను అందించిన మన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలాంటి ముఖ్యమంత్రి దేశంలో ఎవరూ లేరన్నారు. సర్పంచి దేవగిరి సుజాత ఓంకార్‌రెడ్డి, డాక్టర్ విజయ మాట్లాడారు. ఉచిత వైద్యసేవలు అందించడం అభినందనీయమని తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎస్.చెన్నకేశవరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ఎం.బాలకోటేశ్వరావు, ఉపసర్పంచి మరీదు స్వప్న, పార్టీ నాయకులు దేవగిరి ఓంకార్‌రెడ్డి , ఎంపీడీఓ ఇన్‌చార్జి బీఎల్‌వీ శేషగిరిరావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం రోగులకు మందుల కిట్లు అందజేశారు. అంగన్‌వాడీ టీచర్లు ఏర్పాటు చేసిన పోషకాహారం స్టాల్‌ను పరిశీలించి, ఆహార పదార్థాలను రుచి చూశారు.

సంక్షిప్తం

■ **నిబంధనల మేరకు బాణసంచా దుకాణాల నిర్వహణ**
హనుమాన్‌జంక్షన్ రూరల్: దీపావళి పర్వదినం పురస్కరించుకుని ఏర్పాటు చేయనున్న తాత్కలిక బాణాసంచా విక్రయ దుకాణాలను ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్వహించాలని హనుమాన్‌జంక్షన్ సీఐ అల్లు నవీన్ నరసింహమూర్తి చెప్పారు. పోలీస్‌స్టేషన్‌లో రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో తాత్కలిక బాణసంచా విక్రయ దుకాణాల ఏర్పాటుపై వ్యాపారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఎస్‌ఐ ఏడీఎల్ జనార్ధన్, ఏఎస్‌ఐలు సమ్మెట సాయిబాబు, రామచంద్రరావు, ఫైర్ ఆఫీసర్ రామ్మోహనరావు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెంకట్రావు పాల్గొన్నారు.

■ **కుందేరులో ఉచిత పశు వైద్యశిబిరం**
కంకిపాడు: ఫౌల్ట్రీ పితామహుడు డాక్టర్ బీవీ రావు జయంతి సందర్భంగా కుందేరు పశువైద్య శాల ప్రాంగణంలో సోమవారం ఉచిత పశువైద్య శిబిరం జరిగింది. పశువుల్లో గర్భకోశ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. కార్యక్రమంలో శ్రీనివాసా హేచరీస్ జేఎండీ కలకోట సోమిరెడ్డి, విశ్వశాంతి విద్యాసంస్థల చైర్మన్ మాదల సుబ్రహ్మణ్యేశ్వరరావు, సర్పంచ్ కలకోట రాధికారెడ్డి, ఎంపీటీసీ, ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ నందిపాటి బిందుమాధవి, పీఏసీఎస్ చైర్మన్ ఆకుల రంగారావు, కందలంపాడు సర్పంచ్ బాయిరెడ్డి నాగరాజు, పాలకేంద్రం అధ్యక్షుడు బొమ్మారెడ్డి వెంకటరెడ్డి, గుడ్లవల్లేరు ఏడీ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్, పశువైద్యాధికారి రంగారావు పాల్గొన్నారు.

■ **విశ్వరూప మహాసభను జయప్రదం చేయండి**
నున్న(విజయవాడరూరల్): హైద్రాబాద్‌లో ఈ నెల 11వ తేదీ జరిగే విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని ఏపీ మాదిగ ఉద్యోగుల సంఘం కార్యదర్శి దేవరపల్లి విక్టర్‌బాబు పిలుపునిచ్చారు. నున్నలో సోమవారం జరిగిన మాదిగ ఉద్యోగుల, రాజకీయ నాయకుల సంయుక్త సమావేశంలో విక్టర్‌బాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పోరాట స్ఫూర్తితో సభను విజయవంతం చేయాలని కోరారు. ప్రధాని నరేంద్రమోదీ పాల్గొని స్పష్టమైన హామీ ఇవ్వబోతున్నారని ఆయన తెలిపారు. రాష్ట్ర రెల్లి సంఘం నాయకులు ధనియాల నాగరాజు గన్నవరం నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి మంద వేణుబాబు మాదిగ జిల్లా కో ఇన్‌చార్జి ఐనంపూడి ఆశీర్వాదం మాదిగ, ఎంఈఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

■ **మంతెనలో దీక్షాధారులకు అన్నసంతర్పణ**
కంకిపాడు: మంతెనలో దీక్షాధారులకు కోసం నిర్వహిస్తున్న అన్నసంతర్పణ కార్యక్రమం కొనసాగుతోంది. గ్రామానికి చెందిన శ్రీ రామభక్త అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో చేపట్టిన అన్నసంతర్పణ సోమవారంతో 35వ రోజుకు చేరింది. అన్నప్రసాద దాత కొండేటి శివరామప్రసాద్ వితరణతో మాలధారులకు అన్నసంతర్పణ ఏర్పాటుచేశారు. తొలుత గురుస్వాములు చిమటా ప్రసాద్, తాతా వెంకటేశ్వరరావు నేతృత్వంలో మాలధారులు అయ్యప్పకు ప్రత్యేక పూజలు చేయించారు.

■ **బాల్య వివాహాలు తీవ్ర నేరం**
గన్నవరం రూరల్: బాల్య వివాహాలు చట్టరీత్యా తీవ్ర నేరమని సూరంపల్లి సర్పంచ్ పులపాక బాబూరావు అన్నారు. స్థానిక పంచాయితీ కార్యాలయంలో సోమవారం బాల్య వివాహాల నిర్మూలన, నిరోధక కమిటీ సమావేశం జరిగింది. ఎంపీటీసీ సభ్యురాలు బి.నీలిమ, సచివాలయం కార్యదర్శి శ్రీనివాస్, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

■ **రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు**
పెనమలూరు: యనమలకుదురు శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈవో ఎం.గంగాధరరావు మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీ నుంచి ఆలయంలో నెల రోజుల పాటు పరోక్ష గోత్రనామాలతో అభిషేకం చేస్తారని చెప్పారు.

■ **రాజకీయ దురుద్దేశంతో బోడె అవాస్తవ ప్రచారం**
ఉయ్యూరు: రాజకీయ దురుద్దేశంతోనే మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్మన్ నాని మాట్లాడుతూ ప్రభుత్వంపై బోడె ప్రసాద్ చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. ఇసుక దోపిడీ చేస్తున్నారంటూ బోడె ప్రసాద్ అవాకులు, చెవాకులు పేలడం సరికాదని హితవు పలికారు. సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు మాట్లాడుతూ టిడ్కో ఇళ్లను పేదలకు ఇవ్వడం ఇష్టంలేకే టీడీపీ అనవసర రాద్ధాంతం చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలోపార్టీ పట్టణ అధ్యక్షుడు అబు కలాం, కౌన్సిలర్లు కూరాడ వెంకట లక్ష్మి, బి.లక్ష్మి, నాయకులు దిరిశం జ్యోతిర్మయి, తదితరులు పాల్గొన్నారు.

■ **స్వామియే శరణమయ్యప్ప..**
కంకిపాడు: అయ్యప్ప పడిపూజా మహోత్సవం మండలంలోని దావులూరులో ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. గ్రామానికి చెందిన అయ్యప్ప మాలధారి సుబ్రహ్మణ్యస్వామి నివాసం వద్ద పడిపూజా మహోత్సవం నిర్వహించారు. గురుస్వామి శ్రీనివాసరావు నేతృత్వంలో పూజలు చేశారు.

■ **గోపవరపుగూడెంలో ప్రచార జాత**
గన్నవరం రూరల్: గోపవరపుగూడెం సహకార బ్యాంకు వద్ద పర్సన్ ఇన్‌చార్జి కొలుసు పాములు ఆధ్వర్యంలో సోమవారం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అందిస్తున్న పథకాలపై ప్రచార జాత నిర్వహించారు. కీర్తన కల్చరల్ సొసైటీ కళాకారులు డిజిటల్ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. సీఈవో జొన్నలగడ్డ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు

పెనమలూరు: యువకుడిపై దాడి చేసిన నలుగురు వ్యక్తులపై పెనమలూరు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరు కొండల్యనగర్‌లో ఉంటున్న గుమ్మడి అప్పారావుకు ప్రదీప్, సందీప్ ఇద్దరు కుమారులు. సందీప్‌కు ఇంటి సమీపంలో నివసిస్తున్న షేక్ మహబూబ్‌కు వాహన పార్కింగ్ విషయంలో వివాదం వచ్చి గొడవపడ్డారు. ఈ నేపథ్యంలో చోడవరం రోడ్డులో సందీప్ ఉన్న సమయంలో సుభాని, గుల్షన్‌బాషా, మస్తాన్, నాగుల్‌మీరావలి వచ్చి గొడవపడి దాడి చేశారు. ఘటనలో సందీప్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని చికిత్స కోసం విజయవాడ జీజీహెచ్‌లో చేర్చారు. ఘటనపై బాధితుడి తండ్రి అప్పారావు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

వరకట్న వేధింపుల ఫిర్యాదు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారిపై పెనమలూరు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం కానూరు టీచర్స్‌కాలనీ కృష్ణవంశీ అపార్టుమెంట్‌కు చెందిన మువ్వ సుమితాదేవి 2022, ఏప్రిల్ నెలలో ఖమ్మం జిల్లా కంభంపాడుకు చెందిన మువ్వ రాజేష్‌ను కట్నకానుకలు ఇచ్చి పెద్దల సమక్షంలో విజయవాడ గురునానక్ నగర్‌లో వివాహం చేసుకుంది.
పెళ్లి సమయంలో భర్త ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడని నెలకు రూ 1.50 లక్షలు సంపాదిస్తున్నాడని నమ్మించారు. అయితే మువ్వ సుమితాదేవి కాపురానికి వెళ్లిన తరువాత భర్త ఉద్యోగం చేయడం లేదని తెలిసింది. అతనికి దురలవాట్లు ఉన్నాయని గుర్తించింది. భర్తతో పాటు అత్త పూర్ణమ్మ, బావలు మురళి, నరేష్ అదనపు కట్నం కోసం వేధిస్తుండటంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

బంగారు ఆభరణాల చోరీపై కేసు

పెనమలూరు: కానూరులో బంగారు ఆభరణాలు చోరీ జరిగిన ఘటనపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం కానూరు సాయిబాబా గుడి సమీపంలో గుత్తా వేణుగోపాల్ నివసిస్తున్నాడు. వేణుగోపాల్ పెద్దమ్మ మరణించడంతో తన తల్లి వృషబిందు, మేనమామ భార్య పి.లక్ష్మీదేవితో కలిసి కారులో వైజాగ్ వెళ్లారు. కార్యక్రమం ముగిసిన తరువాత తిరిగి మళ్లీ కారులో కానూరుకు వచ్చారు. కారులో వచ్చే సమయంలో తల్లి వృషబిందు హ్యాండ్ బ్యాగ్‌లో బంగారు గాజులు 6, ఎర్రపూసల గొలుసు 1, చైన్‌లు 2, డైమండ్ లాకెట్ 1, డైమండ్ చెవి దిద్దులు 2 ఉన్నాయి. ఇంటికి వచ్చిన తరువాత హ్యాండ్‌బ్యాగ్ తెరిచి చూడగా బంగారు ఆభరణాలు కనపడలేదు. పోయిన వస్తువుల కోసం వెదికినా దొరకక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.